వీరవల్లడు

[ఆఖ్యాయిక]

= శ్రీ విశ్వనాథ సత్యనారాయణ =

నేను తెల్లవారకముందే లేచి బయలుదేరాను. ఆ రాత్రే బ్రాహ్మణ అమ్మవారితో చెప్పేను "అమ్మా, తెల్లవారకముందే లేచిపోతాను. మీతో చెప్పేందుకు మీరు అప్పటికి లేవరు" అని. ప్రొద్దు పొడిచేవరకు చల్లగా ఉండి రాత్రి భోంచేయలేదని అనిపించలేదు గాని ప్రొద్దెక్కినకొద్దీ ఎండ చిటచిట లాడి తలమాడ్చినకొద్దీ కడుపులో బాధకూడా ఎక్కువైంది. మా దొర అంటూఉండేవాడు "కలికాలంలో మనుష్యులు అన్నం లేకపోతే చచ్చిపోతా"రని. ఆ పూర్వకాలాలల్లో కొన్నాళ్లు బొమికలున్నన్నాళ్లు ప్రాణా లుండేవట; కొన్నాళ్లు చర్మం ఉన్నన్నాళ్లూ ఉండేవిట; కొన్నాళ్లు మాంసం ఉన్నన్నాళ్లు ఉండేవిట. ఇప్పు డన్నం ఉంటేనే ప్రాణం. నేను రాత్రి చెరువులో దిగి కాళ్లు కడుక్కున్నాగాని నాల్గు దోసెళ్లు నీళ్లయినా పుచ్చుకున్నా కాను. ఎందుకు పుచ్చుకోవాలి? పుచ్చుకుంటే మా దొరసానిగారు రానంటుందేమో. కొంతదూరం నడచింతర్వాత ఒక తంగేడుపుల్ల విరిచి నోట్లో పెట్టేను. అది నమలటం, ఉమ్మేయటం, పళ్లు తోముకోటం అన్నమాట. ఇదొక కాలక్షేపంగా బయలుదేరేను. కృష్ణ దగ్గరకు వెళ్లేటప్పటికే రెండు జాములు కావస్తోంది. నా దొర బ్రతికి ఉన్నప్పుడు ఈవూ రెన్నిసార్లు వచ్చానో. ఎప్పటికప్పుడే క్రొత్త. దూరాన్నుంచి ఆ కృష్ణకరకట్ట చూడగానే గుండెలో ఏమిటో క్రొత్తగా ఉంటుంది. మా ఊళ్లో ఒక కొండాలేదు, ఒక నదీలేదు. ఒక అడవీ లేదు, ఒక పెద్ద విశాలమైన స్థలమూ లేదు. అన్నీ చేలుకాడిగట్లు. చిన్నప్పటినుంచీ అక్కడ పెరగటం మూలంగా కాబోలు ఓ పెద్ద నదిని చూచినా, కొండను చూచినా, ఒక అడవిని చూచినా ప్రాణం ఏమో తేలిపోతుంది. కృష్ణకరకట్ట ఎక్కేను. ఎక్కిచూస్తే పెద్ద యిసుక. దూరాన పెద్ద నీటిప్రవాహం. అదివరకంతా మూసుకోఉన్న ఆకాశంఅల్లా ఒక్కసారిగా తెరుపుడుపడ్డట్టుగా, కుదించుకొని ఉన్న నేల బారలు వేసినట్లుగా, గుండె మనలోంచి వెళ్లిపోయి ఏదో పెద్ద గండభేరుండపక్షిఅంత అయినట్లుగా విచిత్రమైన విప్పారటం చేస్తుంది. మావూళ్లో చెరువునిండా నీళ్లు వస్తే తపకలుకొట్టుకొని కలకలలాడే నాచిన్నతనంలో మా ముసలిదొరగారి గొడ్లను ఆచెరువులో దిగేసి వాటి వీపులమీద కూచొని చెరువంతా ఈదులాడేవాణ్ణి. నేను మొదటిసారి ఈకృష్ణ చూచినప్పుడు మాఊరి చెరువు లాకవెయ్యింటి నొక్కసారి చూచినట్లుంది. ఇవి పంటరోజులు. అందుచేత కృష్ణ ఆఒడ్డూ యీ ఒడ్డూ తనాయించిలేదు. ఒక అరకోసెడు మేర అంతా యిసకపారలేసిఉంది. కృష్ణపాయ అవతల ఒడ్డు నానుకొనిఉంటుంది. సముద్రానికి దగ్గరగనుక పాయ చాలా లోతు. నేను పూర్వం బళ్లు కట్టుకొని ఈవూ రొచ్చినప్పుడు బండి ఇసకలమీద వదలిపెట్టి ఎడ్ల తలతాళ్లు పట్టుకొని ఏట్లో దిగేసి పడవమీద కూర్చొని చాలాతడవలు వెళ్లేను. ఎన్నిసార్లు వెళ్లేనో అన్నిసార్లు ఈకృష్ణఅందం నాగుండెను తేల్చివేస్తూనే ఉంది. మళ్లీ చూశాను. మళ్లీ అంతే. నా కిన్నేళ్లు వచ్చినా అంతే. చచ్చేదాకా అంతే? ఏముందీ కృష్ణలో—ఈ ఇసకలో, ఈప్రవాహంలో? నామనస్సు నామనస్సులో లేదే. నేను నేను కాదే. నామీద కొండంత పని బరువుందే. ఇప్పటికి ఈ ఊరుకాని ఇంత,నీళ్లు, ఇసక ఆకాశము చూస్తే ఏమిటి నామనస్సు పొందే అలజడి. నాగుండెని ఈశరీరంలో విడిఖైదు

వేశారు. ఈగుండె ఈ నేను అనుకునే ఈ కొరడి దాటి పోలేకుండా ఉంది కాబోలు. పోయి, ఇంత విశాలమైన ఆకాశంలో తిరుగుదామని దీని ఉద్దేశం. చిలకని పంజరంలో పెడితే-దాన్ని చాలారోజులు పంజరంలో ఉంచిన తర్వాత దానిని వదలిపెడితే, అది పల్లటీలు కొడుతూ ఆకాశం అంతా తనదే నన్నట్టుగా, ఆకాశమే తను తనే ఆకాశం అన్నట్టుగా ఎగిరిపోతుందే. అల్లా ఉంటుంది నాగుండె; ఇంత కృష్ణను, ఇంత ఇసకను, ఇంత ఆకాశాన్ని చూస్తే. నేను ఈ సంతోషం అంతా పడుతూ నీటి ఒడ్డుకు వెళ్లేసరికి ఎవరో బ్రాహ్మలు పడవలో ఉన్నారు. పడవవాడు మళ్లీ వస్తా నుండమన్నాడు. మళ్లీ వచ్చేటప్పటికి రెండు గడియలు పడుతుంది. ఈ లోపుగా ముఖం తొలిచాను. సరంగు ఈసారి నన్నెక్కించుకున్నాడు. కొత్తముఖాలు కనిపిస్తే వాడు కేవు అడుగుతాడు. నన్నడగలేదు. నేనిదివరకెన్నోసార్లు వెళ్లేనుకదూ. మా దొర అతని కెన్నోసార్లు ఎన్నో ఇచ్చాడు. మా దొరసానిగారు పుట్టిన ఊరు కృష్ణకు అవతలఒడ్డున అంటుకొనే ఉంది. ఊరిమొగతలే చెరువుంది. దొరసాని చెరువులో స్నానంచేసి బిందెతో నీళ్లు పట్టుకొని ఇంటికి వెళ్తోంది. నన్ను చూడలేదు. నేను 'అమ్మా' అని పలకరించాను. ఆవిడ చూచి,నన్ను చూచినతొందరలో పడ్డ తొట్రుపాటులో బిందెలో ఒక పావువంతు నీళ్లు ఒంటినిండా వలకపోసుకుంది."ఎందుకురా ఇలా వచ్చావు?" అంది. "మీకోసమే వచ్చాను. చెపుతాగా"అన్నాను. ఆవిడ నాతో మాట్లాడేనని ఆ బిందెడునీరు పారపోసి మళ్లీస్నానంచేసి నీళ్లుతెచ్చుకోపోయింది.మడిగట్టుకొని బ్రాహ్మలు మాతో మాట్లాడరుగా.మళ్లీ స్నానం చెయ్యకముందామె అందికదా, "ఒరే వల్లా, నీమొగం చూస్తే రెన్నాళ్ల పట్టి భోజనం లేనట్టుంది. అదేమిరా ఏనుగంత ముండాకొడుకువి అలా అయిపోయినావు? మామామగారు—అంటే రాయప్పగారు—నీకూడా అన్నం పెట్టటం లేదా? ఇంటికి పద. దొర లున్నారు. నేను వస్తున్నాను"అన్నది. నేను వెళ్లాను. వాకిట్లో మా చిన్నదొర ఎండలో కూచొని మన్నుతో ఆడుకుంటున్నాడు. నేను "బాబూ, మంటిలో ఏమిటి? లే" అన్నాను. ఆయన మెడ యిట్లా వాల్చి నావంక చూచి "నీవొచ్చా వెందుకు?" అన్నాడు. నేను "ఒచ్చాగాని, అన్నయ్య ఏడీ" అన్నాను. ఆయన "అన్నయ్యను తీసుకోరానా." అని లోపలకు పోయి అన్నగారిని చెయిపట్టుకొని బలవంతంగా లాక్కొ వస్తున్నాడు. నేను వచ్చానని చెప్పలేదు. ఆయనకు మరీ చిన్నతనం అవటంమూలంగా మన పాలేరు అనిగాని, వల్లడనిగాని చెప్పలేకపోయినాడేమో. ఎందుకు చెప్పలేడు? ఈ నాలుగైదునెలలబట్టీ నేను కనపట్టం లేదుకాబట్టి అదొక క్రొత్తగా ఉంది. పాతపాతగా ఉండి అందులో కొత్త పసితనం, గ్రుక్క త్రిప్పుకోలేని ఊహ, మళ్లీ నన్ను చూట్టంతోటే తన వాళ్లెవరో వచ్చారనుకోటం, ఈచమత్కారం అంతా ఆపసితనంలో ఉంది. అన్నగారు నన్ను చూట్టంతోటే "ఇందుకా? వల్ల డొచ్చాడే అమ్మా, అమ్మా" అంటూ యింట్లోకి పరుగెత్తేడు. ఇంతలో దొడ్డిత్రోవ వెంట వాళ్లమ్మగారింట్లోకి వచ్చింది. ఆమె తడిధోవతి విప్పి వేరే పొడిబట్ట కట్టుకొని తల్లీకొడుకులు వాకిట్లోకి వచ్చేటప్పటికే ఒకగడియసేపు పట్టింది. ఆవిడ వస్తూనే అంది, "ఏడిరా వల్లడు" అంటూ. ఆ అనటంలో తాను నన్నంతకుపూర్వం చూడనట్లు, తన పెద్ద బిడ్డే ముందర నన్ను చూచినట్టు. ఆపిల్లవాడి సంతోషం ఎందుకు చెడగొట్టాలని.మా దొరసానిగారి పేరు సర్వలక్షమ్మగారు. ఆవిడ ఎంత ఇల్లాలో,ఎంతమనిషో నేను చెప్పట మెందుకు? మాచుట్టుపట్ల పది ఊళ్లకు తెలుసు. నేనల్లా ఆస్తి నిలబెట్టినవాణ్ణిగాని ఆవిడ కొడుకుల్ని పెద్దవాళ్లను చేసి సంబాళించి, మాదొర ఉన్నప్పుడెట్లాగో మళ్లీ సంసారం ఇల్లా సాగించిన తల్లి. మాదొర ఉన్నన్నాళ్లూ దొరచాటున ఉండి, ఆవిడ తెలివితేటలు, ఆవిడవ్యవహారపుతనం మాకే తెలియలేదు. నేనున్నా లేకపోయినా, ఆవిడే పొలమంతా చూచుకొని పిల్లల్ని బాగుచేసింది. ఆవిడ కఱ్ఱ చేత్తో పుచ్చుకొని కాడిగట్టున నిలచుంటే ఏ పాలేరు, ఏ కూలివాడు పాలుమాలడానికి వీలులేకుండా ఉండేది. ఆకొడుకుని అల్లా సంతోషపెట్టటంలో అదే మొదటిసారి మాదొరసాని అంటే ఏమిటో నాకు తెలియటం. పసివాడైనకొడుకు సంతోషం చెడిపోతుందేమో నని అంతజాగ్రత్తగా మాట్లాడే దావిడ ఎంత నిద్దామనిషి

కావలె. మాదొర ఉండగా ఆవిడమంచితనమే చూచాగాని ఆవిడలోనున్న ఈగుణం చూచానుకాను. అదికూడా వేళలో ఉంది. ఆవిడ వాళ్లు బాగున్నారా, వీళ్లు బాగున్నారా అని అడిగింతర్వాత నన్ను అన్నం తినమన్నది. నిన్నటి చద్దిఅన్నం ఉన్నది, మజ్జిగపోసి పెడతానంది. నేను కథంతా చెప్పేను. "దొరసానమ్మగారూ,నీవూ పిల్లలూ వస్తే, వస్తానని మాట ఇస్తే నేను అన్నం తింటాను. లేకపోతే ఇక్కడే ఉపవాసం చేస్తాను. చచ్చిపోయింతర్వాత కృష్ణలోకి ఈడిపించు" అన్నాను. ఆవిడ "ఒరేవల్లా, నే నాడదాన్ని. మామగారు సామంతుడు. వారు బ్రతికిఉన్నప్పుడు ఊరంతా ఆయన గీసిన గీతమీద నడిచింది. ఇప్పు డాయన్ను మరచిపోయింది. నా కక్కడ ఊరా పేరా? ఆరునెలలు గిద్దెడుగింజలు దొరక్క నానాత్రిప్పలూ పడ్డాను. పిల్లలనుకూడా చివరకు సాకుకోలేకపోయినాను. మళ్లీ వచ్చి ఆయిబ్బందులు పడి మళ్లీ యిక్కడకు తిరిగిరావటమేకదా? ఎందుకు పట్టుపడతావు? పొలం పండించి ఆయన పోసికొనే. మేమేం తింటాము, నీకేమి పెడతాము? ఏమి కానుందో అది అవుతుంది. రాతిలో కప్ప కాహార మాతతముగ నిడెడు దైవంబు మర్త్యుల కేల మాను" అన్నది. మాదొరసానిని చూచినకొలదీ, ఆవిడమాటలు విన్నకొద్దీ నాపట్టుదల మరీ వృద్ధిఅయింది. మాదొర మాట్లాడినట్లే మాట్లాడుతుంది. ఆపద్య మెప్పుడూ మాదొర చదివేవాడు. మాదొరసాని చదువుకొన్నది కాదు. ఆభర్త మాట్లాడుతూంటే ఆమాటలు, ఆపద్యాలు అన్నీ ఆవిడ కొచ్చినవి. ఈసంగతి తర్వాత తర్వాత నాకు మరీ తెలిసింది. ఆదొరకు తగిన దొరసాని. ఇన్నాళ్లూ ఈతల్లి మగనిచాటున ఉంది. ఈవిడ వ్యవహారం చెయ్యటం మొదలుపెడితే రాయప్పగా రేమి నిలుస్తాడు? అస లాయనకు మాటపొంది కేమితెలుసు? ఈమె నాదొరశిష్యురాలు. నేను అన్నానుకదా, "అమ్మా, ఊరు మునపటికిమల్లేనే ఉందనుకున్నావా? కరణము, మునసబు, నాయకుడూ అందరూ మనవైపు" అన్నాను. ఆవిడ ఆశ్చర్యపోయి "అవేమి మాటలురా? మనవేపువాళ్లయితే నేనక్క డల్లా ఉంటే చూస్తూ ఊరుకుంటారా? ఆఊరు మీదొరనాటి ఊరా? వాళ్ల మనస్సులన్నీ అమ్ముడుపోయినై" అన్నది. నేను వేసిన పాచికలు, ఎత్తిన ఎత్తుగడలు, అవిపారిన వైనం అంతా చెప్పేను. ఆవిడకు కొంత నచ్చింది. "సరి. ఐతే చూద్దాంలే. నీవుముందరభోజనంచేయ"మన్నది. "కాదు. దొరల్ని తీసుకొని మీరు వస్తానంటే భోజనంచేస్తాను" అన్నాను. ఆవిడ "మరి రావటంతోటే తిండీ తిప్పలూ ఎల్లాగురా? కోమటింట పద్దు ఇదివరకే పెరిగిఉంది. వెళ్లటంతోటే అతను అడుగుతాడు. చేసిన అప్పులన్నీ ఆలాగే ఉన్నై. వెళ్లటంతోటే వాళ్లు అడుగుతారు. నీతో నాకు ముందర నుయ్యి వెనక గొయ్యిలా గుంది" అన్నది. నేను "నీ కాభయం లేదు. నీవు గడపలో అడుగుపెట్టటంతోటే పుట్టెడు జొన్నలు, పందుంజిలం వడ్లు తీసుకోవచ్చి నీయింట్లో వేస్తాను. కోమటికి రెండు బస్తాలజొన్నలు కొలు. నీఇంట్లో నీవుండు. ఇంక నేను రాయప్ప నాడిస్తాను చూడు. మన ఎడ్లనీ, మన పశువుల్నీ తీసుకొచ్చి మనసావట్లో కట్టివేస్తాను. కాదంటానికి రాయప్పకు తరంకాదు. కదా"అన్నాను. ఆవిడ బాగా ఆలోచించింది. అప్పటి కింకా జాముప్రొద్దే ఉన్నది. చివరిమాట అన్నది. "ఓరి పిచ్చిముండాకొడుకా! నీకెందుకురా ఈబాదరబందీ అంతా? ఆదొరకొడుకు లేమైపోతే నీకేమి? ఈ బలవద్విరోధం నీ కెందుకు? నీవు అన్నం తినిపో" అని. నేను "నేను అన్నం తిని వెళ్లటానికే అయితే యిక్కడి కెందుకు వస్తాను? దొరలను తీసికోవెళ్తాను. లేకపోతే నాపీనుగ యిక్కడే వెళ్లిందనే పేరు నీకు దక్కాలి" అన్నాను. ఆవిడ "అలాంటి మాట లెందుకు? వస్తానుగా. నీవు భోజనం చెయ్యి" అన్నది. నేను "అల్లా కాదు. నీవు వస్తానని ప్రమాణం చెయ్యి. లేకపోతే నేను భోజనం చెయ్య" నన్నాను. ఆవిడ మొగం అంతా బిగించుకొని "సరే. ప్రమాణం చేస్తున్నాను. భోజనం చెయ్యి" అన్నది. అప్పటి ఆవిడమొగం చూస్తే అప్పు డావిడ నిశ్చయం చేసుకోటం కొడుకుల ఆస్తి నిలబెట్టటంమాత్రమే కాని ఓ పెద్దరాజ్యం ఏర్పాటుచేద్దామని అవి డప్పు డనుకున్నా అంతపని చేసేవరకు నడుము విప్పదన్నట్లుగా ఉంది. ఆదొరసానిమొగం చూస్తే జరగబోయే పనంతా అప్పుడే జరిగినట్లున్నది. భోజనం చేశాను.

ఆరాత్రి సుఖంగా నిద్రపోయినాను. మరునాడు మాదొరసానినాయనగారు పంచాంగం చూచి బాగానే ఉందన్నాడు. బయల్దేరి కృష్ణ దాటేము. కృష్ణ దాట్టంతోటే అక్కడో ఊరుంది. ఆఊళ్లో ఓబండీ బాడుగకు కట్టించాను. రెండు మాడ లిమ్మన్నాడు. సరే అని ఒప్పుకున్నాను. బండీకి గుడిశ లేదన్నాడు. లేకపోతే మాడన్నరే యిస్తానన్నాను. ఆబండీఆయన అరమాడా ఎక్కడపోతుందో నని ఎక్కడో గుడిశ తెచ్చి కట్టాడు. మా పెద్దదొర ఎడ్ల మెడలో గంటలూ, మువ్వలూ లేకపోతే తా నెక్కనన్నాడు. నేనూ అంతే నన్నాను. ఆవూళ్లో మువ్వల పట్టెడ ఎక్కడా దొరకలేదు. దొరసాని పిల్లవాణ్ణి కోప్పట్టం మొదలు పెట్టింది. నేను "మనం దొరలల్లే వెళుతున్నాం. మువ్వలపట్టెడ లేకుండా ఎట్లా వెళుతాం" అన్నాను. మళ్లీ కృష్ణదాటి మాదొరసాని పుట్టిన ఊరు పోయి ఊళ్లో కనుక్కొని ఎవరింట్లోనో అద్దాలుతాపిన మువ్వల పట్టెడ లుంటే తీసుకోవచ్చాను.

౬

ఈ ఆలస్యంమూలంగా బయలుదేరే వేళకు పొద్దు వాటారింది. మాపెద్దదొర బండిఆయన్ని తొట్లో కూచోనివ్వలేదు. తానే కూచొని తోలాలంటాడు. ఆ బుడ్డాయనకు ఎడ్లు నడవ్వు. బండిఆయన కొంచెం రోగిష్ఠివాడు. ఆయన నడవలేడు. దొరసాని బండిలో కూచుందికనుక ఈయన తడికమీద కూచోటానికి వీల్లేదు. ఇట్లాగే ప్రొద్దూకేదాకా సాగింది. నేను ఎడ్లతలతాళ్లు పుచ్చుకొని లాగితేకాని ఎడ్లు నడవ్వు. నేను తలతాళ్లు పుచ్చుకుంటే దొరసానిగారి ఆచారానికి పనికిరాదు. "సరే, నేను స్నానం చేస్తాను లేరా. బండి ఎట్లాగో అట్లా సాగేటట్టు చూడ"మంది. నేను దొరను కొంచెంసేపు బ్రతిమిలాడేను. ఆయన చివరకు పోయి తల్లిదగ్గర కూచున్నాడు. బండీఆయన తొట్లో ఎక్కేడు. బండీ సాగింది. రాత్రి ప్రొద్దు పోయేవరకు మొన్నరాత్రి నేను పడుకున్న ఊరు వెళ్లాం. మాదొరసాని పిల్లలకోసం అన్నం మూటకట్టు కొచ్చింది. ఆచెరువులో రేవుదగ్గర పిల్లల కన్నం పెట్టింది. కాని మజ్జిగ లేదు. నే నాబ్రాహ్మణ అమ్మ వారింటికి కెళ్లి మాదొరసానిగారినీ పిల్లలనూ తీసికొ వెళ్తున్నాననీ, వారు వచ్చారనీ, చెరువుదగ్గర మా దొరసాని పిల్లలకు అన్నం పెడుతోందనీ, మజ్జిగ కావాలనీ చెప్పేను. ఆవిడ "అదేమిట్రా, మీ కిది పరాయిఇల్లా? మొన్న మావాకిట్లో పడుకున్నావు, నేను పెట్టిన అన్నం తిన్నావు, బండి చెట్టుక్రింద దింపేవా? ఛీ, ఛీ! మొన్న నీకు తెలియక అన్నం పెట్టేను. నా అన్నం తిన్నవాడెవడూ యిల్లా చేయలే"దంది. "తల్లీ, నీ అన్నం నేను తినలేదు. నేను ప్రతిజ్ఞ పట్టేను. అందుచేత తినలేదు. నీ అన్నం తినని తప్పు యివ్వాళ తెలిసింది. ఇవ్వాళ పెట్టు. తింటా"నన్నాను. మేమందరం వారింటికి వెళ్లేము. ఆవిడ బండివాడికీ, నాకూ అన్నం పెట్టింది. మా దొరసాని స్నానం చేసి, ఫలహారం చెయ్యందీ వదలిపెట్టందే. మా దొర లిద్దరూ వస్తూనే నిద్రపోయినారు. ఆ బ్రాహ్మణ అమ్మవారు మా దొరసానితో "మీ ఆయన ఎంత దాత అనుకున్నావమ్మా. నా కొడుకుపెళ్లికి మా వారు మీ ఊరు యాచనకు వచ్చారు. మీ వారిని చూశారట. ఆ సమయంలో మీ వారు ఒక రాశిగా పోసి మాడలు లెక్కపెడుతున్నారట. మావారు నా కొడుకుపెళ్లి అనిఅనక ముందే రెండు దోసెళ్లు తీసి ఒళ్లో పోశారట. మావారు ఊళ్లోలేరు. ఉంటే మిమ్మలను క్రింద కూర్చోనిచ్చేవారా? మా ఇంట్లో మీ కథ చెప్పుకోని రోజే ఉండదు. మీ కివ్వాళ ఆదరించి అన్నం పెడుతున్నానంటే నా మంచితనం ఏమీ కాదు. మీ ఋణం వెయ్యి జన్మాలిచ్చినా తీర్చుకోలేము." అంది. అందరూ నిద్రపోయినారు.

మరునాడు భోజనం చెయ్యకుండా ఆ మహాతల్లి మమ్మలను పోనియ్యలేదు. బండివాడు తనకు బాడుగ నష్టమని మొదలుపెట్టేడు. నాకు కోపం వచ్చింది. "ఛీ! నీ కంత కష్టం అయితే నీ బండి తోలుకోపో. ఈ ఊళ్లో యింకో బండి కుదురుస్తా"నన్నాను. ఆయన మళ్లీ సద్దుకున్నాడు. భోజనం చేసి బండి కట్టేము. దారి కటూ యిటూ కొతిమేరచేలు, శనగచేలు. గాలి కమ్మగా వస్తోంది. పైరగాలి పరవళ్లు త్రొక్కుతోంది. పాలపిట్ట లెగురుతూ కూస్తున్నవి.

ఒక నక్క తన జల్లితోక మళ్లించి పొట్టమీదికి త్రిప్పుకొని కోసమూతి ఆకాశంవైపు త్రిప్పి, దారికి ఎదురుగా, దూరంగా, సరిగ్గా నడిమిగా కూచొని బండిగంటల మోత విని ఎడమనుండి కుడికి తీర్చింది. మాదొరలకు "అదిగో నక్క బాబూ" అని చూపించాను. పెద్ద ఆయన బండి దూకి నడుస్తా నన్నాడు. కొంతదూరం పోయేటప్పటికి ప్రొద్దు కూకవస్తోంది. సాయంకాలపు ప్రొద్దు యిట్టే కుంకుతుంది. నాకు సూర్యుడిమీద మహాకోపం వచ్చింది. పట్టపగలు ఊళ్లోకి వెళ్లకుండా ఈయన కేమి చుప్పనాత్తనం, మొగం ముణుచుకుంటూ డని. అన్నీ అంత అందంగా వస్తవి. మాఊరు రెండు కోసు లుండనగా ఒక ఊరు వచ్చాము. ఆఊళ్లో ఒక ముసలిబ్రాహ్మడు ఏవూరని అడిగేడు. మా ఊరుపేరు చెప్పి మాదొరపేరు చెప్పేను. ఆవిడ మాదొరసాని, వారిద్దరూ పిల్లలు అని చెప్పేను. ఆయన మాబండీ పోనిచ్చాడు కాదు. ఈరోజు రాత్రి మాయింట్లో ఉండిపోవలసిందే నన్నాడు. బండీ కదలనిచ్చాడు కాడు. తప్పనిసరి కారాత్రి అక్కడే ఉన్నాము. మరునాడు ప్రొద్దున బండీ కట్టేము. ఆయన మాదొరలకు చొక్కాగుడ్డ లిచ్చాడు. బండి పగలు ఝాముప్రొద్దుఎక్కినతర్వాత కోసఎండలో పట్టెళ్ల అద్దాలమీద పడి పదును పెట్టిన బల్లెములు విసరుతూంటే పట్టెడగంటలూ మువ్వలూ ఈలపిట్టలపాటలకు తాళాలు వేస్తుంటే అందరూ తల లెత్తిచూస్తుంటే ఊళ్లో ప్రవేశించాము.

* * *

పదిరోజులు పరాయిస్థలములో ఉండివస్తే మన ఇల్లే మనకు క్రొత్తగా ఉంటుంది. ఆక్రొత్తలో ఒక ప్రియత్వం ఉన్నది. ఈప్రియత్వం ఉభయత్రానూ. ఇల్లువంటిదే ఊరున్నూ. స్నేహము ప్రవాసాశ్రయమువలన నశించిపోతుం దన్న భర్తృహరిమాట సర్వదా నిజము కాదు. సర్వలక్షుమ్మగారి సంసారం మీద ఊరికి క్రొత్త అభిమానం పుట్టింది. చెప్పినట్లుగానే వల్లడు పుట్టెడు జొన్నలూ తీసుకొని వచ్చేడు. అక్కడినుంచి సర్వలక్షుమ్మగారి ప్రతిభ కనిపించటం మొదలుపెట్టింది. ఆవిడ తన గొడ్లనన్నింటినీ రాయప్ప గారి దొడ్లోంచి ఊడతీయించి తెప్పించి తన దొడ్లో కట్టేయించింది. తన పాలేళ్లను విడిగా తాను పిలిపించింది. ఒకరోజున పాలేళ్లందరినీ వెంటతీసుకొని రాయప్పగారింటికి వెళ్లింది. ఏకళ్లం ఊడిచిపోసిన రాశిలో వల్లడు పాలేరుభాగం తీయబోతూంటే రాయప్పగారు తీయనివ్వలేదో ఆరాశిజొన్నలు బస్తాలకు పట్టించి రాయప్పగారి సావట్లో గడమంచీల మీద వేసివున్నవి. సర్వలక్షుమ్మగారూ ఆబస్తాలన్నీ తన పాలేళ్లచేత తన ఇంటికి పట్టింపించింది. రాయప్పగారి భార్య తిట్టటం మొదలుపెట్టింది. సర్వలక్షుమ్మగారు "అత్తా, మామగారికి మతి పోతే నీకుగూడా పోయిందా?" అన్నది. ఆవిడ మళ్లీ మాటాడలేదు. రాయప్ప గారు చూస్తూ ఊరుకున్నాడుగాని కుయిక్కుమన లేదు. అంతటితో వ్యవహారం పొసగిందని ఊరంతా అనుకున్నారు. వల్లడు సర్వలక్షుమ్మగారితో "అమ్మా, ఇంక ఫరవాలేదు" అన్నాడు. సర్వలక్షుమ్మగారు నవ్వింది. వల్లడన్నాడు కదా: "ఏమమ్మా నవ్వుతావు?" సర్వలక్షుమ్మగా రన్నది. "ఒరేయి, నే నాడదానిని. మామగారు నా కడ్డంరాడు. అడ్డంవస్తే ఊళ్లోవాళ్లందరూ నవ్వుతారని: రేపు నీవు అరక కట్టు. అప్పుడు తెలుస్తుంది." అన్నది.

మళ్లీ వల్లడు చెపుతున్నాడు:

మా దొరసాని అన్నంతా అయింది. నేను అరక కట్టేను. రాయప్పగారు తన పాలేళ్లు, తాను, ఊరిలో మరి కొంత మద్దతుతో వచ్చి అటకాయించాడు. 'ఈ పొలం నీది కాదు' అని. ఈ లోపుగా ఏమి చేశాడో వాళ్లందరూ కఱ్ఱలతో వచ్చేరు. నేను జాగ్రత్తపడి శాళ్ల లేదు. లేకపోతే నేనూ, యానాది గంగడూ కఱ్ఱలు పుచ్చుకొని నిలుచుంటే, అంతమందీ ఆగేది లేదు. కాని కఱ్ఱలతో ఎంతసేపు వ్యవహారం నిలవ త్రొక్కగలను? ఎప్పటికప్పుడు మేము కొద్ది మందిమి ఉంటే వాళ్లు, వాళ్లు కొద్దిమంది ఉంటే మేము పైచేయిగా ఉండటమేకదా. అందుచేత నేను మెత్తని మార్గం పట్టేను. "దొరా, నా దొరసాని వచ్చింది. తన పొలం నన్ను దున్నమంది. నేను దున్నుతున్నాను. దొరసానితో వెళ్లి మాట్లాడు. నన్ను అటకాయించి ఏమిలాభం?" అన్నాను. ఆయన "ఈ దొంగ మాటలు నా దగ్గిర కాను. నేను నాగళ్లు ఊడతీస్తాను. నీవు

పోయి మీ దొరసానితో చెప్పుకో" అన్నాడు. నేను మా పది మంది పాలేళ్లలో ఒకణ్ణి పిలిచి నీవు పోయి మునసబు కరణాల్ని, నాయకుణ్ణి పిలచుకరమ్మన్నాను. కాని వారెవ్వరూ రాలేదు. నేను రాయప్పగారితో "దొరా, మీరు ఊడతీయండి, నేను అరక సాగించేదే నిజం" అని చాలు మొదలుపెట్టేను. వాళ్లు పదిమందీ వచ్చి పదినాగళ్లూ ఊడతీశారు. నేను ఏమి చెయ్యాలి? ఆయనతో ఇట్లా అన్నా: "ఊడతీయగానే అయిపోలేదు. నే నానాడు చేసిన ప్రతిజ్ఞ అలానే ఉంది. మా దొరసాని ఆడది. పిల్లలు పిల్లలు అనేకదా నీధిలాసా." అని ఎక్కడలేని కోపం తెచ్చుకొని "నాగళ్ల కడ్డం తగులుతావా? ఇది నీసొమ్మా? పలుపులు పగ్గాలు కోస్తావా?" అని పలుపులూ పగ్గాలూ కొడవలుచ్చుకుని ముక్కలు చేశాను. "మేడికోలలు విరక్కొడతావా?" అని మేడికోలలన్నీ నేనే ముక్కలు చేశాను. "కఱ్ఱులు లాగేస్తావా?" అని కఱ్ఱులు బలవంతంగా గొడ్డళ్లతో పెకలించాను. దొరా, అప్పుడు నే నాడిన నాటకం చూడాలి. చెపితే ఏముంది? లేకపోతే ఆ కోపం ఎల్లా చూపించానో, ఆయన చెయ్యని పనులన్నీ ఆయనే చేసినట్లు చూచేవాళ్లందరికీ అనిపించేటట్లుగా నాటకమాడేను. అది ఒక చమత్కారం. సరే, ఆ కోసిన పలుపులు, పగ్గాలు, విరిగిన మేడికోలలు, పెల్లగించిన కఱ్ఱులు అన్నీ మూటకట్టి ఎడ్ల నింటికి తోలుకెళ్లమని ఒకరిని పంపించి, అవన్నీ తక్కిన ఎనమండుగురు పాలేళ్ల భుజానా పెట్టి బయలుదేరి వెడుతూ రాయప్పగారితో ఇలా అన్నాను: "ఇదిగో, పిల్లల నోట్లో మన్ను కొట్టాలని చూస్తున్నావు. ఇంత ఆస్తీ కాజేయాలని చూస్తున్నావు. పైన దేవుడున్నాడు. నేను పోయి ఠాణాలో చెప్తాను. రేపు ఠాణేదారును తీసుకొవస్తాను. నీ మునసబు కరణాలు ఎట్లా అబద్ధం చెప్తారో చూస్తాను. పెళ్లాలు, బిడ్డలు కలవాళ్లేకదా" అని దారివెంట పోయినంతమేరా, ఆయన కనిపించినంత మేరా ఈమాటలంటూ నేవెళ్లేను. మా ఊరికి ఠాణా మూడామడలో ఉంది. ఆ ఎనమండుగురు పాలేళ్లు, నేను తొమ్మండుగురము ఠాణాకు చేరేటప్పటికి ప్రొద్దుతిరిగింది. ఠాణాకు వెళ్లేను. ఎనమండుగురితో చెప్పేను: "ఒరేయి, ఠాణేదారుగారు కనపడటంతోటే అందరూ ఏడవాలిరా" అని. ఠాణేదారుగారి యెదుట ఈ ముక్కలన్నీ పడవేసి "దొరా, రక్షించాలి. రాయప్పగారు నాదొరఆస్తి అంతా తినెయ్యాలని కూర్చున్నాడు. నాదొరసాని ఆడది. ఇల్లు కదలలేదు. పిల్లలకు ముక్కుపచ్చలార లేదు. తల్లినీ బిడ్డలనూ ఆరునెలలు తరిమివేశాడు. పుట్టింట సాగక మళ్లీ పిల్లలను తీసుకొవచ్చింది. ఊళ్లో చాకిరీచేసేవాళ్లెవరూ మాటవినకుండా చేశాడు. మునసబుకరణాలను తనవైపు కట్టుకున్నాడు. చాకలివాడు గుడ్డలు ఉతకడు. కుమ్మరి కుండలు తీసుకోరాడు. సాలెవాడు గుడ్డనేయడు. మాదిగవాడు చెప్పులుకుట్టడు. పిల్లల తలలు మాసిఉన్నై. మంగలికి కబురంపిస్తే మొగం దాటవేస్తాడు. ఇవ్వాళ ప్రొద్దున మేము అరకలు కడితే ఇదిగో, బాబూ, పగ్గాలూ, పలుపులూ కోశాడు. నాగళ్లు విరక్కొట్టేడు. ఆ దొర కుటుంబంతోపాటు ఆ చెట్టు నాదరువు చేసుకున్న పది కుటుంబాలవాళ్లం మేము. మా దొర పోయి ఏణ్ణర్థం అయింది. ఇన్నాళ్లూ గంజికి మొగం వాచిఉన్నాము. పొలాలన్నీ ఆ లెక్కలు మీ కాగితాలల్లో వ్రాసిఉన్నై, కాని మా దొర ఇంట్లో లేవు. పాలిస్తారో, మీ కాగితాలు కూడా మారుస్తారో, పాలించండి" అని తొమ్మండుగురమూ చూచేవాళ్ల పేగులు తరుక్కుపోయేలాగు ఏడిచాము. ఆ ఠాణేదారు మా దొర ఇంట్లో ఎఱ్ఱని జొన్నన్నంలో గడ్డంటి గేదెపెరుగు పోసుకుని, ఒఱ్ఱని గోంగూరపచ్చడి నంచుకుంటూ ఎన్నిసార్లు తిని త్రేచాడో ఆయనకే తెలియదు. వారు నియోగులు. ఆ కాలంలో నియోగులందరికీ తగరపురేకుల చెప్పులంటే చాలా సరదా. అలాంటి జోళ్లు ఏటేటా మాదొర దగ్గర ఆయన తీసుకుపోతూండేవాడు. అందుచేత ఆయనకు మాదొరంటే అభిమానం. ఆయనముఖం కొంత అనుకూలంగా ఉందని గ్రహించి నే నీసంగతులుకూడా చెప్పేను. "బాబూ, మీకు మాదొర ఎన్ని చెప్పుల జోళ్లు ఇచ్చాడు. మీరు వస్తే మాదొరఇంట్లో చుట్టాలకన్న ఎక్కువగా చూచాడు మిమ్మల్ని. ఆదొర ఆస్తి యిల్లాగు కానిస్తారా ఇవ్వేళ? ఇన్ని కుటుంబాల ఉసురూ రాయప్పగారు పోసుకుంటున్నాడు. మీరు

న్యాయం చేస్తానంటే మేము తిరిగిపోతాం. లేకపోతే మా పెళ్లాంబిడ్డ లక్కడచస్తారు, మేమిక్కడ చస్తాం." తాణేదారుగారిదంతా విన్నాడు. "ఒరేయి వల్లా, నేను నిన్నెరుగనా, నీదొర నెరుగనా? కాని వ్యవహారం కొంచెం ముదిరింది. నీవు పోయి జమీందారుగారితోకూడా చెప్పి వారినికూడా తీసికోవస్తేకాని ఇది పొసగదు. ఇప్పుడు రాయప్ప బలవంతుడై ఉన్నాడు. మా లెఖ్ఖల్లో మీఆస్తిపంపుళ్లై విడకొట్టి వ్రాసిలేదు. మీదొర ఉన్నన్నాళ్లు భరోసామీద నడిచింది. పంపకంకాని ఆస్తి. ఇది ఇది అని ఎట్లా? జమీందారుగారు వస్తేకాని మీపంపకాలు తేలవు. కరణం మహాతుచేశాడా? ఎన్నాళ్లయింది? ఇవన్నీ ఊళ్లో ఉన్న సాక్ష్యంమీద తేలాలి. మీఊళ్లో పంచాయితీదార్లేమంటారో? రాయప్ప కరణం మునసబుల్ని పట్టుకున్నాడంటున్నావు. వ్యవహారం చిక్కుల్లో పడ్డది. మీదొరకూడా ఆయన పెద్దవాడని అంతా ఆయనపేరుగా నడిపేడు. నాకేమీ తోచకుండా ఉంది. ఇదివరకన్నీ శిస్తులూ రాయప్పకట్టినట్లుంది. వ్యవహరించింది మీదొరే. కాయితందాఖలా రాయప్ప కనుకూలంగా ఉంది. నీవు పోయి జమీందారుగారితో చెప్పుకుంటేనేకాని ఇది కుదరదు. జమీందారుగారు ఫలానా రోజున మీఊరు వస్తే నేనూ వస్తాను" అన్నాడు. దొరా, నీకు ఈ మాటలన్నీ క్రొత్తగా ఉండవచ్చు. ఇవన్నీ ఇంగ్లీషువారు ఈగడ్డలో వచ్చి ఎవడు వ్యవసాయం చేస్తున్నా పొలం వాడిదీ అని నియామకంచేసి కాగితాలు పుట్టించని రోజుమాటలు. అప్పటికి దేశంలో యిల్లా ఉండేది. ఎవడు అరకకట్టి దున్నితే వాడిది ఆ పొలం. ఎవడిపేర తహసీలు చెల్లించిఉంటే వాడిది ఆపొలం. రైతులదగ్గర కాగితాలుండేవికాదు. అంతా పంచాయితీదార్లమీద ఉండేది. నీకు కావలసివస్తే బంజరుగా ఉన్న పొలం దున్నుకో. ఒద్దనేవారు లేరు. నీవు వరసగా దున్నుకుంటూ ఉన్నన్నాళ్లూ ఆపొలం నీది. నీవు దున్నిన పొలంమీద నీపంటలో ఆరవవంతు జమీందారు తీసికొనేవాడు. కావలసినంత బంజరు ఉండేది. క్రొత్తగా అరక కట్టినవాడికి పొలం లేకపోలేదు. ఇది ఆనాటి వ్యవహారం. అప్పుడు నేనన్నానుకదా- "బాబూ, నేను జమీందారుగారి దగ్గరకు పోతాను. ఈలోపుగా రాయప్పగారు మీదగ్గరకు వస్తాడేమో" అని అంటూ ఉండగానే తాణేదారు "రానీ, తప్పుడు ముండాకొడుకుని. పది కుటుంబాల నోట్లో గడ్డకొడతాడా? అందులో నీ దొరనా? నీ దొరే ఇట్లాంటివాడైతే రాయప్పను సాదిలోకి రాకుండా చేసేవాడు. వంశంలో పెద్దవాడని అట్టిపెట్టిన గోప్యం ఉంచుకోలేకపోయినాడు. నీవు పో" అన్నాడు. నేను మనస్సులో సంతోషించాను. ప్రభువుదర్శనం ఎల్లా అవుతుంది? సరే. మేము పదిమంది పాలేళ్లం. ఈమేడికోళ్ల పుల్లలూ, ఈ తెగకోసిన పలుపులూ, ఈ కఱ్ఱముక్కలూ పదిమందిమీ పదికట్టలు నెత్తిన పెట్టుకొని నూజివీడు వెళ్లేం. ప్రభువుదర్శనం ఎవరికీ కాదు. మేము దేవిడీముందర మాబరువులు దింపుకొని ఏడవటం, మొత్తుకోటం, ప్రభువుదర్శనం కావాలంటం! ఎవ్వరూ మమ్మలను పాలించినవాళ్లు లేరు. నాలుగురోజులు గడిచింది. ఏమి చెయ్యాలో తెలియలేదు. చివరకొక బంట్రోతు ప్రభువు ఆరోజు సాయంత్రం అందరకూ దర్శనం యిస్తారని చెప్పేడు. ఆదర్శనం ఇస్తాడన్నచోట పోయి నిలుచున్నాము. ప్రభువు నిజంగా ప్రభువు. పెద్దపెద్ద దొరలందరూ వచ్చిఉంటే మొట్టమొదట మావంక చూచాడు. చూడటంతోటే నేను వెంటనే మాట్లాడేను. నాగోడంతా మొదలుపెట్టి చెప్పేను. వారు పలుకరిస్తారని ఎదురుచూడకూడదు. ఆచూపు ఇంకొకరివైపు మళ్లిందా మన పని మాసాలు పట్టిందే. నేను మొదలుపెట్టటంతోటే "అయ్యా, నేను ఫలానా దొర పాలేరును" అన్నాను. ప్రభువుకన్నులు పెద్దవైనవి. అవటంతోటే నేను గ్రహించాను మాదొర పేరు ప్రభువుకికూడా తెలుసునని. పది ముక్కల్లో అంతా చెప్పేను. "దొరా, నాయజమానీ రాయప్పగారూ తాతాసహోదరులు. నాయజమానిది పెద్దకుదురు. రాయప్పగారు వయస్సుచేత పెద్దవాడు. నాయజమాని పెద్దవాడుకదా అని రాయప్పగారిమీద మర్యాదపెట్టి వ్యవహరించాడు. రాయప్పగారు నాయజమాని పోయినాడని ఆయనభార్యనీ, పిల్లలనూ ఊళ్లోంచి వెళ్లకొట్టి ఆస్తిఅంతా తాను కాజెయ్యాలని చేస్తున్నాడు. మేము పదిమంది పాలేళ్లం. ఇంకా గొడ్లను కాచేవాళ్లూ

వాళ్లూ మూడుకుటుంబాలున్నాయి. మా యజమాని కుటుంబంతో పదునాలుగు కుటుంబాలం. మా యజమానికీ రాయప్పగారికీ పంపకాలైనవి. లెఖ్ఖల్లో లేవు. ప్రభువులు వచ్చి మా యజమాని పిల్లలను దయ చూస్తే మేమందరం బ్రతుకుతాము. ఆయన ఊరంతా ఆకట్టేడు. పంచాయితీదార్లు రాయప్పగారి వేపున ఉన్నారు. ప్రభువు లక్కడ నిలుచుంటేనే గాని నిజం బయటకురాదు. అంతా చీకటిగా ఉంది. దొరలు ప్రొద్దుపొడిస్తేనే గాని ఏది ఏదో కనిపించదు." అన్నాను.

దొరా, చూచావా, ఇక్కడ నిన్ను దొర అంటాను. అక్కడ నిన్ను నా యజమాని అన్నాను. అక్కడ ప్రభువునీ దొర అని నిన్నూ దొర అనకూడదు. అందుచేత అల్లా చెప్పేను. నేర్చుకో అన్నాడట మా నాయనతో వల్లడు.

ప్రభువు శ్రీ నోటివెంట ఒక్కటే మాట వచ్చింది. "మేము శుద్ధపాడ్యమినాడు మీ ఊరు వస్తాము." అనటంతోటే ప్రభువుచూపు వేరేవైపుకి మళ్లింది. ఇంక అక్కడ నిలుచుంటే తప్పు. వెంటనే నేను తక్కినవాళ్లందరినీ మళ్లించుకొని వచ్చేశాను. మేము ఎక్కడికి వెళ్లామో, నేను ఏమి చేశానో ఊళ్లో ఎవ్వరికీ తెలియదు. నేను తెలియనీయలేదు. నేను ఠాణాకు వెళ్లినట్లు ఠాణేదారు చెప్పితే నేనేమి చెయ్యను? లెఖ్ఖలన్నీ రాయప్పగారి కనుకూలంగా ఉన్నవి అన్నట్లు వదంతి పుట్టించాను. ఎడ్లని రాయప్పగారి సావిట్లో కట్టేయించాను. మా దొరసాని రాయప్పగారింట్లో నించి తెచ్చిన జొన్నల రాసి బస్తాలు మేము పదిమందీ తీసికెళ్లి రాయప్పగారింట్లో వేశాము. శుద్ధ పాడ్యమినాడు మా దొరసానీ, పిల్లలూ మళ్లీ పుట్టింటికి వెళ్తారని మేము పదిమందిమీ ఎక్కడ పడితే అక్కడ చెప్ప మొదలు పెట్టాము. దీని వల్ల ఊళ్లో ఒక మార్పు కలిగింది. అదివరకు ఎదురుగా ఉండేవాళ్లకు కూడా జాలి పుట్టింది. నేనంటే అక్కడక్కడ కొంచెం లోకువ కూడా అయింది. "వీడేమో పెద్ద అట్టాచేస్తాను, ఇట్టా చేస్తాను అన్నాడు. కాగితాలన్నీ రాయప్పగారి వైపునే ఉన్నవిట" అని కొందరు, "ఉంటే మాత్రమేమి? ఆయనపిల్లలను అన్యాయం చేస్తాడా" అని మరి కొందరు. "కాగితాలెట్లా ఉంటే నేమి, పంపకాలయినయ్యా లేదా. పంపకాలైతే పిల్లలాస్తి పిల్లలదేను" అని అందరూను. నేను ఒక రోజున ఠాణాకు పోయి ఠాణేదారు గారితో చెప్పేను. ఆయన "ఒరేయి వల్లా, నీవు నీ దొరంతవాడవురా. ఈ సాహసం నీ దొర దగ్గర ఉండేది. ఇదంతా చేసిన తరవాత తేలిక అనిపిస్తుంది. ఏమున్న దనిపిస్తుంది. ప్రభువు దర్శనం కావటం, దొర నీ వంక చూడటం, చూడటం తోటే నీవు నాల్గు ముక్కల్లో అంత పొసగేటట్టు చెప్పటం, ప్రభువు కన్నటు త్రిప్పటంతోటే ఇటు లేచిరావటం, ఇది ఎవరో మా నియోగిబిడ్డలు చేయవలసినపని. మాలోకూడా రాజసభల్లో మెదిగేవాడికి తెలిసేదికాని ఇంకోడికి తెలియదు" అన్నాడు. నేను "స్వామీ, అంతమాటలెందుకు? శుద్ధపాడ్యమికి తమరు మా ఊరు దయ చెయ్యాలి. ఈలోపుగా నా దొక్క మనవి. ప్రభువులు తమరు ఒక్కసారి అక్కడకు రావాలి. నేను ఊరంతా మైకంలో పెట్టాను. నేనందరూ చచ్చిపోయినా ననుకుంటున్నారు. ఆరోజున చచ్చిపోలేదని చూపిస్తాను. వాళ్లందరూ నివ్వెరపోతారు. ఆనివ్వెరలో విచ్చిన వాళ్ల కళ్లవెలుగుల్లో ప్రభువుల దయ అనే చకిముకి రాయి పెట్టి నాదొరఇంట దీపం వెలిగిస్తాను" అన్నాను. ఠాణేదారు నావంక నిదానించిచూచాడు. నేను శలవ తీసుకుంటా నన్నాను. ఆయన "ఒరేయి, ఇక్కడెందుకు పుట్టేవురా?" అన్నాడు. నేను ఆయనపాదాల దగ్గిర తలమోపి ఇంటికి వచ్చాను. ఇంటికి వెళ్లి మా దొర పొలంరాళ్లన్నీ పంపకంనాటి ప్రకారంగా అన్నీ సరిచూచాను. అమావాస్యనాడు రాత్రి ఒకనాగలి తీసుకోపోయి ఎవ్వరికీ తెలియకుండా మాదొరపొలం ఎక్కడెక్కడ తెగకొట్టుకున్నారో అదంతా బద్దింపుగా చాళ్లు తీశాను. మరునాడు ప్రొద్దున్నే మునసబు గారింటికి వెళ్లేను. మునసబుగారు మొగం కడుక్కుంటున్నాడు. 'ఆపద కడవంబెట్టను' అన్న పద్యం చదివేను. ఆయన 'ఏమిరా' అన్నాడు. "దొరా, నిజం మీద నిలవాలి. ఇవ్వాళ నీవు నిలబెడితే నా దొరలు నిలుస్తారు. ప్రొద్దెక్కేటప్పటికి తెలుస్తుంది. నీపాడి

ఆవుకి నేను మందుపోశాను" అన్నాను, వెళ్లాను. గంగడితో నాయకుడి దగ్గరకు వెళ్లేను. నాయకుడితో అన్నాను: "నీతాత వాడుకున్న చెంబు నీ కెల్లాంటిదో నా తాతలు చేసిన పాలేరుతనం నా కల్లాంటిది. మన ప్రభువులు హైదరాబాదునబాబు క్రిందివారు. వాళ్లు ముసల్మానులు. నీవు ముసల్మాను. మధ్య ఉన్న మా ప్రభువు నామతంవాడు. నామతం మంచిదో నీ మతం మంచిదో ఇవ్వేళ తెలియాలి. నామతం మంచిది చేశాను. నీమతం మంచిది నీవు చెయ్యి" అన్నాను. కరణంగారి దగ్గరకు వెళ్లాను. "దొరా, చెప్పులు మెత్తగా ఉన్నాయా" అన్నాను. ఆయన "ఉన్నైరా. ఏమిలాభం ? నీవు చేస్తానన్నది చేయలేకపోతివి" అన్నాడు. ఆయనతో అంతా చెప్పేను. ఆయన "మున సబుతోకూడా చెప్పేవా" అన్నాడు. "దొరా, ఇం కొకడికి చెపుతానా? నీవునియోగివి, అందుకని చెప్పే" నన్నాను.

మా నాన్న చెప్పినది.

ఆమధ్యాహ్నం జమీందారు వచ్చేడు. అంతా అరగడియ పట్టలేదట. వ్యతిరేకంగా ఎవ్వడూ ఊళ్లో సాక్ష్యం ఇవ్వలేదట. రాయప్పగారు ప్రతిదానికీ 'నిజమే, నిజమే' నన్నాడుట. అంతా ఊరికరణం కలిపించుకొని ప్రభువుముందరనే లెఖ్ఖలన్నీ మా నాయనమ్మ పేర వ్రాశాడట. ఇప్పటికీ లెఖ్ఖలన్నీ బామ్మ పేరే ఉన్నవి. ఆమరునాడు ఊరంతా అట్టుడికినట్టు ఉడికిపోయిందట. పదిమంది పాలేళ్లూ పోయి మళ్లీ జొన్నలబస్తాలింటికి తెచ్చారట. పదిజతల ఎడ్లనీ మళ్లీ తీసుకోవచ్చి మాసావట్లో కట్టివేశారట. రాయప్పగారు మాటాడలేదట. వల్లణ్ణి చూస్తే రాయప్పగారికి వాడు చచ్చిపోయేవరకూ భయమే. తరువాత పదిరోజులకు బామ్మ వెళ్లి రాయప్పగారిని మాతాతయ్యఆబ్దీకానికి భోజనానికి పిలిచిందట. ఆయన "వస్తానులే వస్తాను. ఎందుకు రాను" అన్నాడట.

ఈ కథంతా మా నాయనగారు ఆరోజున రాత్రి నాకు చెప్పేడు. నాకు తెల్లవార్లూ నిద్ర పట్టలేదు. మరునాడు ప్రొద్దున్నే వాకిట్లో కూచున్నాను. వల్లడు మళ్లీ కేకలువేస్తూ వచ్చాడు. వాణ్ణి చూట్టంతోనే 'వల్లా' అని పిలిచి నేను ఏడవటం మొదలెట్టాను. వాడు నిన్నటికీ నేటికీ భేదం చూచాడు. గ్రహించాడు. వాడి తెలివిముందర నేనెంత? ఇంతలో మా నాన్న వచ్చాడు. "ఏమయ్యా, కుఱ్ఱాయనకు చెప్పేవా ఏమి నాకష్టంతా? బలే తెలివిగలవాడవు! కుఱ్ఱాయనకేమి తెలుసు" అని, నావంక చూచి "అవన్నీ ఒట్టిమాటలు బాబూ. మీనాయన అంతేలే. అన్నీ కలిపించిచెప్తాడు. బాబుగా. ఏడవకు" అని అదొకవిసురు తెచ్చుకొని "ఏడిస్తే పొలం ఎల్లా చేస్తావ్? లే, లే" అన్నాడు.

మళ్లీ నేను స్కూలికి వెళ్లాను. నమ్మండి, నమ్మకపోండి. వల్లప్ప అని ఎక్కిరించినవాళ్లకి నలుగురికీ ఫెడేలు ఫెడేలుమని లెంపకాయలు పేలినై. మళ్లీ నన్నన్నవాడు లేడు. నేను అప్పటినుంచీ మాపాలేరుకు మల్లే వీరవల్లణ్ణి అయినాను. చెప్పలేదు కాబోలు. మా ఊళ్లో అందరూ మాపాలేర్ని వీరవల్లడనేవాళ్లుట. అదీ.